సాక్షి సిద్దిపేట

గురువారం । 10 । ఆగస్టు । 2023



కన్నవారికి కడుపు కోత మిగిల్చి..

పట్టుదలతో చదివి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సంపాదించాడు. చేరిన వారంలోనే ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడి కుటుంబానికి తీరని శోకం మిగిల్చాడు.

8లో..



దశలవారీగా గొర్రెల పంపిణీ

దశలవారీగా అర్హులకు గొర్రెలు పంపిణీ చేస్తున్నట్లు ఉమ్మడి మెదక్ జిల్లా గొర్రె కాపరుల సహకార సంఘం చైర్మన్ శ్రీహరి యాదవ్ చెప్పారు.

8లో..



సిద్దిపేట స్వచ్ఛబడి బాగుంది

సిద్దిపేటలోని స్వచ్ఛ బడి బాగుందని, చెత్తను పునర్వినియోగ ప్రక్రియ బోధన వినూత్న రీతిలో ఉందని సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ ప్రియాంక కితాబిచ్చారు.

9లో..

న్యూస్‌రీల్

నేటి నుంచి సిటీ పోలీస్ యాక్ట్

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో గురువారం నుంచి సిటీ పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని సీపీ శ్వేత తెలిపారు. ఈ నెల 17వ తేదీ వరకు నిబంధనలు అమలులో ఉంటాయన్నారు. ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ధర్నాలు నిర్వహించరాదని సూచించారు. సౌండ్ విని యోగంపై ఉన్న నిషేధాజ్ఞలు సైతం కొనసాగు తాయని సీపీ పేర్కొన్నారు.

బస్ బే నిర్మాణ పనుల పరిశీలన



గజ్వేల్‌లో బస్ బే నిర్మాణం పనులను పరిశీలిస్తున్న ఆర్‌ఎం సుదర్శన్

గజ్వేల్: పట్టణంలో బస్‌బే నిర్మాణం పనులను ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుదర్శన్ బుధవారం పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలో తూప్రాన్ రోడ్డులో మోడల్ బస్టాండ్ నిర్మాణం పూర్తి కావస్తుండగా, గజ్వేల్ పట్టణంలో బస్‌బే, ప్రజ్ఞాపూర్‌లో మరో బస్ బే నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయని ఆర్‌ఎం చెప్పారు. పనులను వేగంగా చేపట్టేందుకు సంబంధిత కాంట్రాక్ట్ ఏజెన్సీకి ఆదేశాలిచ్చినట్లు ఆర్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ సురేఖ పాల్గొన్నారు.

ఐక్యంగా పోరాడుదాం



ధర్నాలో పాల్గొన్న వామపక్ష పార్టీల నాయకులు

సిద్దిపేటజోన్: బీజేపీ కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేకవిధానాలను అడ్డుకుంటామని, అందుకు ఐక్యంగా పోరాటాం చేయాల్సిన అవసరం ఉందని వామపక్ష పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ముస్తాబాద్ చౌరస్తాలో మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి, బీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి నర్సింహులు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ లు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరం చేస్తోందని విమర్శించారు. కార్మిక చట్టాలను రద్దు చేసి తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ధర్నాకు సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి పవన్‌లు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఎల్లయ్య, భాస్కర్, అశోక్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ పాపన్న ఉద్యమ వీరత్వానికి ప్రతీక

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

మిరుదొడ్డి(దుబ్బాక): సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఉద్యమ వీరత్వానికి ప్రతీకగా నిలుస్తారని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో బుధవారం పాపన్న గౌడ్ విగ్రహాన్ని గౌడ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజనుల కోసం పోరాడిన పాపన్న తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోతారన్నారు. బహుజనుల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. భూంపల్లిలో బహుజనులు ఏకతాటిపై నిలిచి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయడం శుభ పరిణామమన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటు పడిన మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసుకుని వారు చూపిన ఆశయాలకు అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్య, సినీ నిర్మాత పంజాల జై హింద్ గౌడ్, గౌడ జన హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎలికట్టె విజయ్ కుమార్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకురాలు కత్తి కార్తీక గౌడ్, మోకు దెబ్బ జనరల్ సెక్రటరీ రాగుల సిద్ది రాములు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

• తిరంగా..



హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. బుధవారం బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లతో కలిసి దుబ్బాక పట్టణంలోని పుర వీధుల గుండా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్ ఐపీఓ నార్త్ డివిజన్ అధికారి రాహుల్ మాట్లాడుతూ ఇంటింటా జాతీయ జెండా ఎగురవేసి జాతీయ సమైక్యతను చాటిచెప్పాలని కోరారు. - దుబ్బాకటౌన్

• సుందరంగా..



చిన్నకోడూరు మండలం విరలాపూర్‌లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతోంది. మొక్కలు ఏపుగా పెరిగి రంగు రంగుల పూలతో కనువిందు చేస్తున్నాయి. చిన్నారుల కోసం ఆటవస్తువులు, వాకింగ్ ట్రాక్, వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేశారు. - చిన్నకోడూరు(సిద్దిపేట)

విధుల్లోకి జీపీ కార్మికులు

మంత్రి ఎర్రబెల్లి హామీతో

సమ్మె తాత్కాలిక విరమణ: సీఐటీయూ

సిద్దిపేటరూరల్: గ్రామ పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మెను మంత్రి ఎర్రబెల్లి దయాకర్ హామీతో తాత్కాలికంగా వాయిదా వేశామని, గురువారం నుంచి కార్మికులు విధుల్లో చేరుతారని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రెహమాన్‌కు కార్మికులు విధుల్లో చేరుతారని, సమ్మె విరమణ నోటీసులు అందించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణలో కార్మికుల శ్రమను వెలకట్టలేమని అన్నారు. న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్న హామీతో సమ్మెను తాత్కాలికంగా విరమించామన్నారు.

‘గృహలక్ష్మి’కి బారులు



హుస్నాబాద్‌లోని మీసేవ కేంద్రంలో దరఖాస్తులదారుల సందడి

- పోటెత్తుతున్న దరఖాస్తుదారులు
- ఇప్పటి వరకు 7,540 అప్లికేషన్లు
- గడువు పెంచాలని కోరుతున్న జనం

సాక్షి, సిద్దిపేట/హుస్నాబాద్: ‘గృహలక్ష్మి’ పథకానికి దరఖాస్తులు వెల్లువలా వస్తున్నాయి. ప్రజల నుంచి స్పందన అనూహ్యంగా వస్తోంది. పేద, మధ్య తరగతి వర్గాల సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మొదటి విడతలో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. పట్టణాల్లో, మున్సిపాలిటీల్లో, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓ కార్యాలయాల్లో దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. దరఖాస్తు చేసేందుకు కులం, ఆదాయం ధ్రువీకరణ పత్రాల కోసం మీ సేవ కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. మొదటి విడతకు గడువు నేటితో ముగయనుండటంతో దరఖాస్తు దారులు ఆందోళన చెందుతున్నారు.

దశలవారీగా ఖాతాల్లో జమ..

రాష్ట్ర ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.3లక్షల సాయం అందిస్తామని చాలాకాలంగా ప్రకటిస్తూవస్తోంది. ఎట్టకేలకు ఈ నెల 10వ తేదీలోపు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించారు. ప్రతి నియోజకవర్గానికి 3వేల ఇళ్ల చొప్పున తొలి విడతలో మంజూరు చేశారు. దీంతో దరఖాస్తు చేసేందుకు దరఖాస్తు దారులు బారులు తీరుతున్నారు. ఒక్కో లబ్ధిదారుడికి రూ.3లక్షలను మంజూరు చేస్తుండగా ఇంటి నిర్మాణంలో భాగంగా దశల వారీగా ప్రభుత్వం బ్యాంకు ఖాతాల్లో జమకానున్నాయి. బేస్‌మెట్, రూఫ్‌లెవల్, ఇల్లు పూర్తయిన తర్వాత పూర్తిగా చెల్లిస్తారు. లబ్ధిదారుడు నచ్చిన విధంగా ఇంటి నిర్మాణం చేసుకునే అవకాశం ఇచ్చారు. ప్రభుత్వం మహిళ పేరిట ఇల్లును మంజూరు చేయనుంది. జిల్లా వ్యాప్తంగా ఈ రెండు రోజుల్లో 7,540 దరఖాస్తు వచ్చాయి.

ధ్రువీకరణ పత్రాలకు పరుగులు

దరఖాస్తు ఫారంతో పాటు ఇంటి నిర్మాణ స్థల వివరాలు, ఇంటి పన్ను, విద్యుత్ బిల్లు, కులం, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని నిబంధన పెట్టారు. దీంతో కులం, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు లేక తిప్పలు పడుతున్నారు. ఇటీవలనే తహసీల్దార్‌ల బదిలీల నేపథ్యంలో నూతనంగా తహసీల్దార్లు బాధ్యతలు స్వీకరించిన ప్పటికీ డిజిటల్ కీ లు పూర్తి స్థాయిలో పొందలేదు. కులం ఆదాయం ధ్రువీకరణ పత్రాల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

గడువు పెంచాలి



గృహలక్ష్మి పథకం గడువు పెంచాలి. దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం మూడు రోజుల సమయం మాత్రమే ఇచ్చింది. కుల ధ్రువీకరణ పత్రం కోసం వారం రోజులు పడుతుంది. ఈ తక్కువ సమయంలో తాము దరఖాస్తు ఎలా చేస్తాం. ఇంటి జాగా ఉన్న వారికి రూ 3లక్షల సాయం చేస్తుందని సంతోషంచాను. ప్రభుత్వము గడువును పెంచి సొంతింటి కలను నెరవేర్చాలి.

– దుద్దేల శ్రీనివాస్. ఎల్లం బజార్. హుస్నాబాద్

దరఖాస్తుదారుల్లో అయోమయం

కేవలం మూడు రోజుల గడువు మాత్రమే విధించడంతో ఇబ్బంది పడాల్సి వస్తోందని దరఖాస్తు దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దరఖాస్తు గడువు పెంచాలని దరఖాస్తు దారులు కోరుతున్నారు. ఇది మొదటి విడతకు మాత్రమే చివరి తేదీ అని, గృహలక్ష్మి నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

కులవృత్తులకు భరోసా



చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి హరీశ్‌రావు



వాలీబాల్ స్టేడియం ప్రారంభించిన అనంతరం వాలీబాల్ ఆడుతున్న మంత్రి

- సంక్షేమంలో మనమే ఆదర్శం
- రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: కులవృత్తులను కాపాడుకునేందుకే రూ.లక్ష ఆర్థిక సాయం పథకం అమలు చేస్తున్నామని రాష్ట్ర ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 200 మంది లబ్ధిదారులకు రూ.లక్ష చెక్కులను అందించారు. మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నేరుగా లబ్ధిదారులకే లక్ష రూపాయల చెక్కులను ఇస్తున్నట్లు తెలిపారు. రూ.600 కోట్లతో ప్రత్యేక ప్యాకేజీ ద్వార మత్స్యకారులకు వాహనాలు ఇస్తున్నట్లు తెలిపారు. రూ. 2.20 కోట్లతో కుమ్మరుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాజెక్టు ఏర్పాటు చేశామన్నారు. త్వరలోనే సిద్దిపేటలో బీసీ రెసిడెన్సియల్ కళాశాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో 1550 మంది ఎస్సీ లబ్ధిదారులకు రూ.36.75 కోట్ల సబ్సిడీపై సాయం చేసినట్లు మంత్రి చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినందుకు ఆర్టీసీ కార్మికులు మంత్రి హరీశ్‌రావుని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ రోజారాధకృష్ణశర్మ, సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, నాయకులు పాల్గొన్నారు.

సింథటిక్ రన్నింగ్ ట్రాక్ ప్రారంభం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఉన్నత బాలికల పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, సింథటిక్ రన్నింగ్ ట్రాక్, ఫుట్‌బాల్ గ్రౌండ్‌లను మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. నూతనంగా ఏర్పాటు చేసిన గ్రౌండ్‌లో మంత్రి విద్యార్థులతో కలసి ఫుట్‌బాల్ ఆడారు. అనంతరం మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. రూ.5కోట్ల నిధులతో సింథటిక్ రన్నింగ్ ట్రాక్‌ను నిర్మించామన్నారు. ప్రభుత్వం, దాతల సహాయంతో ఈ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. పారుపల్లి, ఇందిరానగర్, బాలికల ఉన్నత పాఠశాలలు అన్ని పాఠశాలలకు మోడల్‌గా నిలుస్తున్నాయన్నారు. ఈ ఏడాది పరీక్షల్లో 10జీపీఏ సాధించిన విద్యార్థులకు ఆపిల్ ఐ పాడ్ బహుమతిగా అందిస్తామన్నారు.

చిన్నారులతో ముచ్చటించిన మంత్రి

మంత్రి హరీశ్‌రావు చిన్నారులతో కాసేపు ఆత్మీయంగా ముచ్చటించారు.. స్కూల్ ఎలా ఉంది.. సిద్దిపేట అభివృద్ధి లో ఏది బాగుంది.. రన్నింగ్ లో ప్రైజ్ తెచ్చుకుంటారా.. మంచిగా చదివి ఏమవుతారంటూ వారితో ఆత్మీయంగా ముచ్చటించారు.

విద్య హబ్‌గా సిద్దిపేట

సిద్దిపేటరూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. తోర్నాలలో రూ.48 కోట్లతో చేపట్టే సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వ్యవసాయ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మన రాష్ట్రం దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. చంద్రబాబు తెలంగాణ భూములపై పాజిటివ్‌గా మాట్లాడారని అన్నారు. ఒకప్పుడు ఆంధ్రలో ఎకరం భూమి అమ్ముకుంటే తెలంగాణలో ఐదు ఎకరాలు దొరికేది, నేడు తెలంగాణలో ఎకరం అమ్మితే ఆంధ్రలో 50 ఎకరాలకు పైగా దొరికే పరిస్థితి వచ్చిందని చంద్రబాబు అన్నారన్నారు. 105 మెడికల్ పీజీ సీట్లను తెచ్చుకోవడంతో పాటుగా, రూ.250 కోట్లతో బీఎస్సీ భవనం, చంద్లాపూర్‌లో వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాలను నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచే బీఫార్మసీ కాలేజీ ప్రారంభించనున్నట్లు తెలిపారు.



చిన్నారులతో ఆత్మీయంగా ముచ్చటిస్తున్న మంత్రి హరీశ్ రావు



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థినులు

చేర్యాలలో కోర్టు ఏర్పాటు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి ఆధ్వర్యంలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం కేసీఆర్ చిత్రపటానికి పూలాభిషేకం చేస్తున్న న్యాయవాదులతో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): స్థానిక ప్రజల చిరకాల కోరిక నెరవేరింది. చేర్యాలలోనే కోర్టు ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం జీఓ జారీ చేసింది. ఈ ప్రాంత న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు చేసిన విన్నపాల మేరకు స్పందించిన సీఎం కేసీఆర్.. చేర్యాలలో ‘అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు’ను మంజూరు చేస్తూ జీఓ విడుదల చేయించారు. ఈ మేరకు న్యాయవాదులు స్థానిక అంబేడ్కర్ విగ్రహంవద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి పూలాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న సీఎం కేసీఆర్ వెంటే ప్రజలంతా ఉండాలన్నారు. ముచ్చటగా మూడోసారి కేసీఆర్‌ను సీఎం చేసి రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా తీర్చిదిద్దే అవకాశం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపరాణి, ఎంపీపీలు ఉల్లంపల్లి కరుణాకర్, బద్దిపడిగ కృష్ణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల్‌నర్సయ్య, చేర్యాల ప్రాంత న్యాయవాదులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇప్పటివరకు 47 ‘మద్యం’ దరఖాస్తులు

సిద్దిపేటకమాన్: మద్యం దుకాణాలకు నూతన లైసెన్స్ కోసం ఇప్పటివరకు 47 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి తెలిపారు. జిల్లాలోని 93 మద్యం దుకాణాలకు ఈ నెల18వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. బుధవారం వరకు సిద్దిపేట సర్కిల్‌లో 11, గజ్వేల్ సర్కిల్‌లో 23, హుస్నాబాద్ సర్కిల్‌లో 10, చేర్యాల సర్కిల్‌లో 3తో పాటు మొత్తం 47 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు కిరణ్, దీప్తి, ఆయా సర్కిళ్ల సీఐలు, కానిస్టేబుళ్లు చైతన్యకుమార్, రవి, కార్తీక్, నాగరాజు, కరుణాకర్, మౌనిక పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం

- అందుకు చర్యలు చేపట్టాలి
- పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించాలి
- పోలీసు అధికారులకు సీపీ శ్వేత దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సీపీ ఎన్.శ్వేత పోలీసు అధికారులకు సూచించారు. బుధవారం సిద్దిపేట పోలీసు కమిషనర్ కార్యాలయంలో గజ్వేల్, హుస్నాబాద్ డివిజన్ పోలీసు అధికారులతో సీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండింగ్ కేసులన్నీ త్వరగా పరిష్కరించాలని సూచించారు. పారదర్శకంగా కేసుల పరిశోధన ఉండాలని, చోరీ కేసులను అన్ని కోణాలలో పరిశోధన చేసి త్వరగా ఛేదించాలని సూచించారు. సీసీటీఎన్ఎస్ ప్రాజెక్టు ద్వారా ప్రతి దరఖాస్తు, ఎఫ్ఐఆర్, రిమాండ్ సీడీ, ఛార్జ్ షీట్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. బాధితులు పోగొట్టుకున్న, అపహరణకు గురైన సెల్‌ఫోన్లను నూతన టెక్నాలజీ సాయంతో గుర్తించి బాధితులకు అప్పగించాలని తెలిపారు. ప్రతిరోజు వాహనాల తనిఖీలు నిర్వహించాలన్నారు. సైబర్ నేరాల నియంత్రణ, గంజాయి, డ్రగ్స్ వంటివి సమూలంగా నిర్మూలించడానికి గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. సమావేశంలో అదనపు డీసీపీ అడ్మిన్ శ్రీనివాసరావు, గజ్వేల్, హుస్నాబాద్ ఏసీపీలు రమేష్, సతీష్, ఎస్‌బి ఏసీపీ రవిందర్‌రాజు, సీఐలు జానకీరామ్‌రెడ్డి, జాన్‌రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

గిరిజనులకు రిజర్వేషన్లు ఇచ్చింది కాంగ్రెస్సే

- కేసీఆర్ సర్కార్ నేడు ఎస్సీ, ఎస్టీల భూములను లాక్కుంటోంది
- మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్

అక్కన్నపేట(హుస్నాబాద్): గిరిజనులకు 1978లో ఎస్టీలుగా గుర్తించి రిజర్వేషన్లు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు. అక్కన్నపేట మండలంలోని కపూర్ నాయక్ తండాలో బుధవారం అంతర్జాతీయ ఆదివాసి గిరిజనుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిరుపేదల అభివృద్ధే కాంగ్రెస్ ఎజెండా అని అన్నారు. ఆనాడు కాంగ్రెస్ హయాంలో ఎస్సీ, ఎస్టీలకు భూములను ఇస్తే నేడు కేసీఆర్ సర్కార్ ఆ భూములను లాక్కుంటోందని మండిపడ్డారు. ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు లేదని, కేసీఆర్ సర్కార్ వచ్చాక ఊరు ఊరికి బెల్టు షాపులు వచ్చాయని అన్నారు. గిరిజనుల సంస్కృతి సంప్రదాయలు అద్భుతం అన్నారు. హుస్నాబాద్ ప్రాంతంలో అత్యధికంగా గిరిజనులు ఉంటారని, ఈ తొమ్మిదేళ్లలో బీఆర్‌ఎస్ ఏ ఒక్క తండాలో డబుల్ బెడ్రూంలు కేటాయించకపోవడం దురదృష్టమన్నారు. తాము అధికారంలోకి రాగానే ప్రతి నిరుపేద కుటుంబాలకు ఇల్లు నిర్మించుకునేలా రూ.5లక్షలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, పీసీసీ సభ్యులు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మండల అధ్యక్షుడు జంగంపల్లి ఐలయ్య, మాజీ ఎంపీటీసీ బానోతు భాస్కర్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు



మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన రేషన్ డీలర్ల జేఏసీ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రేషన్ డీలర్లకు క్వింటాలు బియ్యానికి కమీషన్ రూ.70 నుంచి 140కు పెంచడంపై బుధవారం జిల్లా రేషన్ డీలర్ల జేఏసీ నాయకులు ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావును క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల జేఏసీ కన్వీనర్ దొమ్మాటి రవీందర్, దేశెట్టి తిరుపతి, నరసింహులు, సత్తయ్య, గంధే శ్రీనివాస్, వీరేశం, తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో రెండు గేదెలు మృత్యువాత



మృత్యువాత పడిన గేదెలు

మద్దూరు(హుస్నాబాద్): పాము కాటుతో రెండు గేదెలు మృతిచెందాయి. ఈ సంఘటన మండలంలోని గాగ్గిళ్లాపూర్‌లో చోటుచేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోయిని సాయిలు రోజుమాదిరిగానే మంగళవారం రాత్రి గేదెలను వ్యవసాయ బావి వద్ద కట్టేసి ఇంటికొచ్చాడు. బుధవారం ఉదయం బావి దగ్గరికి వెళ్లి చూస్తే గేదెలు నురగలు కక్కి చనిపోయి ఉన్నాయి. పాము కాటు వేసిందన్న అనుమానంతో పశువైద్యాధికారులను సంప్రదించాడు. వారు అదే విషయాన్ని నిర్ధారించారు. సుమారు లక్షా 40వేల వరకు నష్ట వాటిల్లిందని రైతు వాపోయాడు.

తుదిగడువు 17 వరకు పొడిగింపు

వర్గల్(గజ్వేల్): 2024–25 విద్యాసంవత్సరం కోసం నవోదయలో ఆరో తరగతి ఎంట్రన్స్ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు గడువును ఈ నెల 17 వరకు పొడిగించిందని నవోదయ ప్రిన్సిపాల్ డీ రాజేందర్ తెలిపారు. ఈ నెల 10 గురువారంతో దరఖాస్తుల గడువు ముగియాల్సి ఉందని, కానీ ఎక్కువ మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు వీలుగా నవోదయ సమితి గడువు తేదీని 17 వరకు పొడిగించిందని పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మతిస్థిమితంలేని మహిళ అదృశ్యం

తొగుట(దుబ్బాక): మండలంలోని మోతెలో జంగం బాలయ్య భార్య వజ్రవ్వకు మతిస్థిమితం సరిగాలేదు. మంగళవారం సాయంత్రం నుంచి ఆమె అదృశ్యమైంది. తెలిసిన వారి వద్ద విచారించినా ఆచూకీ లభించలేదు. బుధవారం పోలీస్ స్టేషన్‌లో భర్త బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ నరేశ్ వివరించారు.

కన్నవారికి కడుపు కోత మిగిల్చి..

విద్యార్థి మృతదేహం అప్పగింత

నిర్మల్‌చైన్‌గేట్: పట్టుదలతో చదివి ట్రిపుల్ ఐటీలో సీటు సంపాదించాడు. ఉన్నతశిఖరాలకు చేరుకుంటానని దిగులు చెందవద్దని తల్లిదండ్రులకు భరోసానిచ్చాడు. ఇంతలో ఏమైందో ఏమో చేరిన వారంలోనే ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడి కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చాడు జాదవ్ బబ్లూ. ప్రాణాలు వెళ్లిన కొడుకు తిరిగి విగతజీవిగా రావడంపై కన్నవారు గుండలావిసెలా రోధిస్తున్న తీరు అందరినీ కంటతడిపెట్టిస్తోంది. నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో పీయూసీ ప్రథమ సంవత్సరం విద్యార్థి జాదవ్ బబ్లూ మృతదేహాన్ని బుధవారం తల్లిదండ్రులు జాదవ్ సంతోష్, రుక్మిణికు అప్పగించారు. నిర్మల్ జిల్లా ఆస్పత్రిలో ఆర్‌ఎంఓ వేణుగోపాలకృష్ణ పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం పోలీసు బందోబస్తు మధ్య అప్పగించారు.





రోదిస్తున్న ట్రిపుల్ఐటీ విద్యార్థి తల్లిదండ్రులు

ట్రిపుల్ ఐటీ విద్యార్థికి కన్నీటి వీడ్కోలు



మనూరు: జాదవ్ బబ్లూ తండ్రి సంతోష్ నాయక్‌ను ఓదార్చుతున్న సురేశ్ షెట్కార్

సొంతూరు నాగపూర్‌లో ముగిసిన అంత్యక్రియలు

నారాయణఖేడ్: బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థి జాదవ్‌బబ్లూ అంత్యక్రియలు మండలంలోని నాగపూర్‌లో బుధవారం సాయంత్రం అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు జరిగాయి. అతను ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. అతడి పార్థీవదేహం సొంతూరకు మధ్యాహ్నానికి చేరుకుంది. అప్పటికే వేచియున్న కుటుంబీకులు, బంధువులు, గ్రామస్తులు మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతం అయ్యారు. మాజీ ఎంపీ టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడే సురేశ్ షెట్కార్ భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. మృతుడి తండ్రి సంతోష్‌నాయక్‌తోపాటు కుటుంబీకులను ఓదార్చారు. రూ.5వేల నగదు ఆర్థిక సాయం అందజేశారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి కూడా సందర్శించి కుటుంబీకులను ఓదార్చారు.

దశలవారీగా గొర్రెల పంపిణీ

చిన్నకోడూరు(సిద్దిపేట): దశలవారీగా అర్హులకు గొర్రెలు పంపిణీ చేస్తున్నట్లు ఉమ్మడి మెదక్ జిల్లా గొర్రె కాపరుల సహకార సంఘం చైర్మన్ శ్రీహరి యాదవ్ చెప్పారు. గొల్లకురుమల కుటుంబాల్లో సీఎం కేసీఆర్ వెలుగులు నింపారని అన్నారు. మండల పరిధిలోని గోనెపల్లిలో రెండో విడత గొర్రెల పంపిణీని ప్రారంభించారు. అర్హులకు గొర్రెలు అందజేస్తున్నట్లు చెప్పారు. గత పాలకులు తమ సంక్షేమాన్ని విస్మరించారన్నారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ప్రతిపక్షాలు ఈ పథకంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజమల్లయ్య, జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య, సర్పంచ్ స్వరూప ఎల్లాగౌడ్, ఎంపీటీసీ పద్మ మల్లేశం, పశువైద్యాధికారి మంజుల, ఇబ్బంది, గొర్రెల కాపరులు పాల్గొన్నారు.



గోనెపల్లిలో...

డ్రోన్‌తో స్ప్రే ..

చిన్నకోడూరు(సిద్దిపేట): డ్రోన్ ద్వారా పొలాల్లో స్ప్రే చేయవచ్చని ఎఫ్‌పీఓ(రైతు ఉత్పత్తిదారుల సంస్థ) చైర్మన్ ఏలేటి వెంకట్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక రైతులు రాజిరెడ్డి, ప్రభాకర్‌ల మొక్కజొన్నకు స్ప్రే నిర్వహించారు. ఆపై డ్రోన్‌పై అవగాహన కల్పించారు. నానో యూరియా లాభాలు గురించి వివరించారు. అన్ని పంటలకు తక్కువ సమయంలో స్ప్రే చేయవచ్చన్నారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు విధానంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఇఫ్కో మార్కెటింగ్ మేనేజర్ కృపాశంకర్, ఎఫ్‌పీఓ డైరెక్టర్‌లు మహేందర్ రెడ్డి, మాధవరెడ్డి, నర్సింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్ వాడే విధానాన్ని వివరిస్తున్న చైర్మన్

ఆటోను ఢీకొన్న లారీ

10 మందికి గాయాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): లారీ, ఆటో ఎదురెదురుగా ఢీకొనగా 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని చంద్లాపూర్ శివారులో బుధవారం సాయంత్రం జరిగింది. గ్రామస్తులు కథనం ప్రకారం వివరాలు.. గ్రామానికి చెందిన దొడ్ల ఎల్లయ్య.. ఆటోలో సిద్దిపేట నుంచి ప్రయాణికులతో చంద్లాపూర్ వస్తున్నాడు. ఈ క్రమంలో చంద్లాపూర్ శివారులోని మలుపు వద్ద అతివేగంగా వస్తున్న లారీ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న అంకువారి చంద్రకళ, కోటని కమల, దరిపల్లి కనకయ్య, కొమ్ముగల్ల లహరి, రాచకొండ లక్ష్మి, పెద్దోళ్ల చంద్రకళ, బోయిని సౌమ్య, వల్లెపు రంగవ్వతోపాటు ఆటో డ్రైవర్ ఎల్లయ్య, రిషి అనే బాలుడికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ సుభాష్ గౌడ్ ఘటనా స్థలికి చేరుకొని ట్రాఫిక్ సరిచేశారు. క్షతగాత్రులను జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ పరామర్శించారు.



గాయపడ్డ క్షతగాత్రుడు

పనులు వేగవంతం చేయాలి

ఝరాసంగం(జహీరాబాద్): రహదారి అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని నిమ్స్ అధికారులు తెలిపారు. (జాతీయ పెట్టుబడులు ఉత్పాదక మండలి) నిమ్స్ రోడ్డు పనులను నిమ్స్ అధికారులు పర్యవేక్షించారు. జహీరాబాద్ పరిధిలోని హుగ్గేల్లి నుంచి బర్దిపూర్ గ్రామశివారు వరకు సుమారు రూ. 100 కోట్లతో 9.5కిలోమీటర్లు 100 అడుగుల వెడల్పు పనులు, మండల పరిధిలోని మాచ్నూర్, బర్దిపూర్ గ్రామ శివారులో కొనసాగుతున్న పనులను బుధవారం పరిశీలించారు. రహదారి నిర్మాణంలో భాగంగా అవసరం ఉన్నచోట కల్వర్టుల నిర్మాణ ప్రాంతాల కొలతలను సేకరించారు. వర్షాలతో పనులు సాగేందుకు ఇబ్బంది అవుతుందని, పనులు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులు రతన్ రాథోడ్, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.



కల్వర్టు నిర్మాణానికి కొలతలు చేస్తున్న అధికారులు

చిన్నారిని చిదిమేసిన లారీ

- రోడ్డు ప్రమాదంలో ఒక్కగానొక్క కొడుకు.. దుర్మరణం
- శోకసంద్రంలో దంపతులు
- అలిరాజ్ పేట శివారులో ఘటన



విద్యార్థి అఖిల్



కొడుకుపై పడి రోదిస్తున్న తల్లి

జగదేవ్‌పూర్ (గజ్వేల్): ఒక్కగానొక్క కొడుకు.. అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు.. ఎన్నో ఆశలు, ఆశయాలతో చదివిస్తున్న దంపతులకు తీరని శోకం మిగిలింది. పదో తరగతి చదువుతున్న కుమారుడు పాఠశాలకు బైక్‌పై వెళ్తుండగా మృత్యురూపంలో లారీ కబళించింది. దీంతో దంపతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మండల పరిధిలోని అలిరాజ్‌పేట శివారులో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలకేంద్రానికి చెందిన మిట్టపల్లి వెంకటేశం, అనిత దంపతులకు కొడుకు అఖిల్, కూతురు ఉన్నారు. అలిరాజ్‌పేటలో సెయింట్ విన్సెంట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ప్రత్యేక తరగతులు ఉండడంతో బుధవారం ఉదయం 8 గంటలకే బైక్‌పై పాఠశాలకు బయలుదేరాడు. అలిరాజ్‌పేట శివారులోకి రాగానే గజ్వేల్ నుంచి జగదేవ్‌పూర్ వైపు వస్తున్న లారీ, బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో అఖిల్ తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ చంద్రమోహన్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుప్రతికి తరలించారు. పలువురు బాధితకుటుంబాన్ని పరామర్శించారు.



కోమటిచెరువును సందర్శిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, జగదీష్‌రెడ్డి

కోమటిచెరువు అద్భుతం

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలోని కోమటిచెరువును బుధవారం రాత్రి రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుతో కలిసి విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి సందర్శించారు. మ్యూజికల్ ఫౌంటేన్, హ్యాంగింగ్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి, రూబీ నెక్లెస్ రోడ్డుతో పాటు నూతనంగా నిర్మిస్తున్న డైనోసర్ పార్క్ గురించి మంత్రి హరీశ్‌రావు వివరించారు. అద్భుతమైన పార్కును సిద్దిపేటలో ఏర్పాటు చేయడం గొప్ప విషయమని, అంతర్జాతీయ స్థాయిలో పర్యాటకులను ఆకర్షించేలా ఉందని మంత్రి జగదీష్‌రెడ్డి అన్నారు. ఆయన వెంట సూర్యాపేట అదనపు కలెక్టర్ ప్రియాంక, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

కారు ఢీ కొని బైకిస్టు మృతి



ప్రశాంత్ మృతదేహం

ములుగు(గజ్వేల్): మూత్ర విసర్జన చేసి బైకు పక్కన నిలబడిన బైకిస్టును కారు ఢీకొట్టడంతో మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం ములుగు మండల కేంద్రం రాజీవ్ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ మండలం రిమ్మనగూడకు చెందిన జక్కుల ప్రశాంత్(25) మేకల వ్యాపారి. వ్యాపారం నిమిత్తం కుటుంబంతో కలిసి చెంగిచెర్లలో ఉంటున్నాడు. మంగళవారం సాయంత్రం చెంగిచెర్ల నుంచి బైక్‌పై సొంతూరుకు వెళ్తున్నాడు. మార్గమధ్యలో ములుగు వద్ద మూత్ర విసర్జన చేసి రోడ్డు పక్కన బైక్ వద్ద నిలబడిన అతడిని సిద్దిపేట వైపు వెళుతున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన అతడిని ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రియుడి ఇంటి ముందు ధర్నా

నర్సాపూర్ రూరల్: ప్రియుడి ఇంటి ఎదుట వివాహిత బుధవారం ధర్నాకు దిగింది. నర్సాపూర్ మండలం రాంచంద్రాపూర్‌లో యువతికి 3 నెలల క్రితం సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం రుద్రారానికి చెందిన యువకుడితో వివాహమైంది. అంతకుముందే గ్రామానికి చెందిన బుడ్డ భిక్షపతిని ప్రేమించింది. ఇటీవల పుట్టింటికి వచ్చిన ఆమె, అతను ఈనెల 5న ఓ ఆలయం వద్ద పెళ్లి చేసుకొని పోలీసులను ఆశ్రయించారు. వివాహిత అన్న విషయం తెలియక ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. తొలి పెళ్లి గురించి కుటుంబ సభ్యులు పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఇరు కుటుంబాలు సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. పెద్దల ముందు వారు కలిసే జీవిస్తామని ఒప్పుకున్నారు. ఆమెను భిక్షపతి ఇంటికి పంపారు. ఈనెల 8న అతని కుటుంబ సభ్యులు వద్దని గెంటివేశారు. గ్రామపెద్దలు ఎంత నచ్చజెప్పినా వినలేదు. దీంతో ఇంటి ముందు ధర్నాకు దిగింది. పోలీసులు అందరినీ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ విషయమై నర్సాపూర్ ఎస్సై శివకుమార్ ను వివరణ కోరగా , ఇరు కుటుంబాలు గ్రామ పెద్దల సమక్షంలో మాట్లాడుకుంటామని చెప్పారని తెలిపారు.

చికిత్స పొందుతున్న ఓటాబందీ వీఆర్‌ఏ మృతి

వట్‌పల్లి(అందోల్): చికిత్సపొందుతున్న ఓటాబందీ వీఆర్‌ఏ మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నిర్జప్లకు చెందిన నాయికోటి సంగయ్య(60) ఆయా గ్రామాల ఓటాబందీ గ్రామ సహాయకులతో కలిసి బైక్‌పై అందోల్ ఆర్డీఓను కలవడానికి వెళ్తున్నాడు. మంగళవారం అందోల్ ఆర్డీఓ కార్యాలయం సమీపంలో బస్సు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడి తలకు తీవ్రగాయాలు కావడంతో జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బుధవారం తెల్లవారుజామున చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుమారుడు నర్సింలు జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నాయికోటి సంగయ్య

రైలు ఢీకొని మతిస్థిమితం లేని వ్యక్తి ..

తూప్రాన్: మతిస్థిమితం లేని వ్యక్తి రైలు ఢీకొని మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని బ్రాహ్మణపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. పట్టణంలోని వెంకటాపూర్ (పీటీ)కు చెందిన సంతోషపురం రాములు(62) కొంత కాలంగా మతిస్థిమితం లేదు. మంగళవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి రాలేదు. కాగా గ్రామ సమీపంలో రైల్వే పట్టల పక్కన కొనఊపిరితో పడి ఉన్నాడు. రైల్వే ప్రయాణికులు స్థానికులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడ చేరుకుని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కామారెడ్డి రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



రాములు

కాంగ్రెస్ పార్టీతోనే సమన్యాయం

పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): క్విట్ ఇండియా ఉద్యమంలో కాంగ్రెస్ చేసిన సేవలు మరువలేనివని పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కార్యాలయంలో పార్టీ జెండాను నర్సారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దేశానికి ఎన్నో సేవలు చేసిందన్నారు. గాంధీ కుటుంబంలో ఎంతో మంది ప్రాణాలు అర్పించారన్నారు. దేశం బాగుపడాలన్నా, అన్ని వర్గాలకు సమన్యాయం జరగాలన్నా కాంగ్రెస్ పార్టీ వల్లే సాధ్యమవుతుందన్నారు. నీళ్లు, నియామకాలు, నిధుల కోసం తెలంగాణ ఏర్పాటు చేస్తే, సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజలను మోసం చేస్తూ సొంత లాభం కోసం పాలిస్తున్నారని ఆరోపించారు. కొందరు బడా వ్యాపారాలు బ్యాంకులకు ఎగనామం పెడితే వారి రుణాలను మాఫీ చేసిన ఘనత మోడీకే చెల్లుతుందన్నారు. మణిపూర్ ఘటనలో మోడీ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని వెంటనే మణిపూర్ బాధితులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రానుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

అందరి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. రేషన్ డీలర్ల కమీషన్ పెంపుపై హర్షం వ్యక్తం చేస్తూ గజ్వేల్ సంఘ డివిజన్ అధ్యక్షుడు అజీజ్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో సీఎం చిత్ర పటానికి ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మదాసు శ్రీనివాస్ క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్ని వర్గాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని కొనియాడారు. కొల్గూరుకు ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రతాప్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ప్రతాప్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.



సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న రేషన్‌డీలర్లు, ప్రతాప్‌రెడ్డి

ప్రతి గ్రామం నుంచి మట్టి,నీటిని సేకరించాలి



రిటైర్డ్ ఎస్సై వీరారెడ్డిని సన్మానిస్తున్న శ్రీకాంత్ రెడ్డి

- 'నా మట్టి–నా దేశం'లో భాగస్వామ్యం అవుదాం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రతి గ్రామం నుంచి మట్టి, నీటిని సేకరించాలని బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. 'నా మట్టి–నా దేశం నేల తల్లికి నమస్కారం -వీరులకు వందనం'ల్లో అందరూ భాగస్వామ్యం అవుదామని అన్నారు. స్వాతంత్ర్య అమృత మహోత్సవాల్లో భాగంగా బుధవారం పార్టీ కార్యాలయంలో రిటైర్డ్ ఎస్సై వీరారెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ, అమృత మహోత్సవ కార్యక్రమాలు బుధవారం నుంచి పంచాయతీ, జిల్లా అంతట కొనసాగించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. భిన్న జాతులకు చెందిన 75 మొక్కలను అమృత వాటిక పేరుతో నాటాలన్నారు. దేశం కోసం జీవితాన్ని అంకితం చేసిన సైనికులు, సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, సిబ్బంది సేవలను స్మరించుకుంటూ కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. చెరువుగట్లపై మొక్కలు నాటడం, పరిశుభ్రంగా ఉంచడం లాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రాణత్యాగం చేసిన సైనికుల కుటుంబాలను సత్కరించాలన్నారు. ప్రధానమంత్రి సందేశాలను వినిపించడంతోపాటు ముఖ్య ప్రదేశాల వద్ద మట్టి దీపాన్ని, మట్టిని కానీ చేతిలో ఉంచుకొని పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేసి సెల్ఫీలు దిగాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సొప్పదండి విద్యాసాగర్, ఉపేందర్ రావు, కోడూరి నరేష్, పత్రి శ్రీనివాస్ యాదవ్, శివ కుమార్, గుండ్ల జనార్దన్, విభీషణ్ రెడ్డి, యాదమల్లు, గోనె మార్కండేయులు, బైరి శంకర్, భూమేష్ గౌడ్, అంబటిపల్లి శ్రీనివాస్, సంతోష్, భోగి శ్రీనివాస్, కృష్ణ, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

పటాన్‌చెరు టౌన్ : తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగింది. బంగారపు వస్తువులు, నగదును గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన పటాన్‌చెరు పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఇస్నాపూర్‌లోని హనుమాన్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న సిమెయన్ ఓ చర్చి పాస్టర్. మంగళవారం ఇద్దరు పిల్లలను స్కూల్‌కు పంపి, ఉదయం 11:30 గంటలకు భార్య సుజాతతో కలిసి షాపింగ్ కోసం చార్మినార్ వెళ్లి సాయంత్రం వస్తే తాళం తీసి ఉంది. లోపలికి వెళ్లి చూస్తే బీరువాలోని వస్తువులు చిందరవందర గా కింద పడి ఉన్నాయి. అందులోని బంగారు పుస్తెల తాడు, లాంగ్ చైన్, కమ్మలు బుట్ట లు, నాలుగు రింగులు, ఏడు లక్షల నగదు గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే బాధితులు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గల్లంతైన వ్యక్తి శవమై...

కల్హేర్(నారాయణఖేడ్): గేదెలు కడిగేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు వాగులో గల్లంతైన వ్యక్తి విగతజీవిగా కనిపించాడు. సిర్గాపూర్ మండలం సంగం శివారులో ఈ సంఘటన జరిగింది. ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జాదవ్ లక్ష్మణ్(45) మంగళవారం సాయంత్రం పొలం పక్కన ఉన్న నల్లవాగు ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌లో గేదేలు కడిగేందుకు వెళ్లి గల్లంతయ్యాడు. బుధవారం ప్రాజెక్టులో శవమై తేలాడు. మృతుడి భార్య రంగుబాయి పోలీసులకు ఫిర్యాదు చేసింది.